క్లుప్తంగా

నేడు క్యాన్సర్ అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినం' సందర్భంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం తోపాటు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ర్యాలీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని, ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుంచి రక్ష అని, పేర్కొన్నారు. ఈ ర్యాలీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

21 వరకు పశుగణన

నెహ్రూనగర్: 21వ అఖిల భారత పశు గణన పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా ఆన్ లైన్ సర్వే గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 1 నుంచి జరుగుతుందని, నగర ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి తగిన వివరాలు అందించి సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 2025 ఫిబ్రవరి చివరి వరకు పశుగణన జరుగుతుందని, అందులో భాగంగా గుంటూరు నగరంలో కూడా జరుగుతుందన్నారు. వార్డ్‌ల వారీగా పశు సంవర్ధక శాఖ ద్వారా నియమించ బడిన సిబ్బంది ఇంటింటికి వచ్చి పెంపుడు జంతువులు, ఇతర పశువులు, వీధి కుక్కల వివరాలను సేకరించి ఆన్ లైన్ యాప్‌లో అప్ లోడ్ చేస్తారని పేర్కొన్నారు. నగర ప్రజలు ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి తగిన సమాచారం ఇచ్చి పశుగణనకు సహకరించాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు



నగరంపాలెం: స్థానిక సంగడిగుంట రెడ్లబజార్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మూరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోశాధికారి కల్లి శ్రీనివాస రెడ్డి, సంయుక్త కార్యదర్శులు మల్లం సత్యనారాయణ, అరవ ఆంజనేయులు పాల్గొన్నారు.

హిజ్రాలపై దాడి

పట్నంబజారు: హిజ్రాలపై మరో హిజ్రా, కొంత మంది యువకులు కలసి దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరంలో హిజ్రాలు సంచరిస్తుంటారు. ఈ క్రమంలో నీరజ గ్రూపునకు సంధించిన హిజ్రాలు, ఐశ్వర్య అనే హిజ్రాకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, భిక్షాటన మాత్రమే చేసుకుందామని చెప్పారు. అయితే బుధవారం నాజ్‌సెంటర్‌లో భిక్షాటన చేస్తున్న యడ్ల గాయత్రి, మరికొంత మంది హిజ్రాలపై, ఐశ్వర్య, మరికొంత మంది యువకులు కలసి దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కమిషనర్‌కే సలహాలు..!

- అప్పగించిన పని చేయనందుకు ఏఈ నాగవేణిని సస్పెండ్ ఆదేశం
- అలా... ఏలా సస్పెండ్ చేస్తారంటూ కమిషనర్‌కే సూచన చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు
- గతంలో సదరు ఏఈపై పలు అవినీతి ఆరోపణలు
- ఏఈను కాపాడేందుకు చక్రం తిప్పుతున్న ఓ ఈఈ



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏం చేసిన, చేయాలనుకున్న నగర కమిషనర్ అథారిటీ.. ఆయన ఎటువంటి నిర్ణయం అయిన తీసుకునే అవకాశం ఉంది. కాని ఇక్కడ కమిషనర్ ఆదేశాలను బేఖాతరు చేయడంతో పాటు ఆయనకే సలహాలు ఇస్తున్నారు.. ఇంజినీరింగ్ అధికారులు. దీంతో ఇంజినీరింగ్ అధికారులపై పలువురు ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ విషయం

కేవీపీ కాలనీలో పరిధిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు, నీటి సౌకర్య కల్పన చేయాలంటూ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నగర కమిషనర్ అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలంటూ సదరు ప్రాంత ఏఈకి తగు ఆదేశాలు జారీ చేశారు. రెండు, మూడు నెలల నుంచి మౌలిక వసతులు కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బంది కూడా అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై కమిషనర్ సదరు ప్రాంతంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయగా అక్కడ ఎటువంటి పనులు ప్రారంభించకపోగా... వర్క్ అండర్ ప్రోగాస్ అంటూ ఏఈ చెప్పుకుంటూ రావడంపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పనలో ఏఈ నాగవేణి విధులలో నిర్లక్ష్యం వహించడంతో, పనుల ఆలసత్వం వహించడంపై ఏఈని సస్పెండ్ చేసి ఈఎన్‌సీకి(ఇంజినీర్ ఇన్ చీఫ్) సిఫార్సు చేయాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌ను(ఎస్ఈ)ని ఆదేశించారు. అయితే ఇక్కడ కమిషనర్ ఆదేశాలను ఇంజినీరింగ్ అధికారులు అమలు చేయడంతో విఫలం చెందారు. ఏఈని అలా.. ఏలా సస్పెండ్ చేస్తారు... సస్పెండ్ చేసే ముందుకు షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని కమిషనర్‌కే సలహాలు ఇస్తున్నారు.

సదరు ఏఈ తీరుపై ప్రజాప్రతినిధులు పెదవిరుపు

సదరు ఏఈ తీరుపై ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు పెదవిరుస్తున్నారు. ఎవరికి సమాధానం ఇవ్వదు... ఫోన్లు లిఫ్ట్ చేయదు.. సమస్యలను పట్టించుకోదని పలువురు కార్పొరేటర్లు కౌన్సిల్ వేదికగా ప్రశ్నించారు. అలాంటి ఆమెను కమిషనర్ సస్పెండ్ చేస్తే ఇంజినీరింగ్ అధికారులు కాపాడులనుకోవడం ఏ విధంగా సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఏఈని కాపాడేందుకు చక్రం తిప్పుతున్న ఈఈ

గతంలో ఇదే ఏఈపై పాత మోటార్లు, పైపులైన్లు అమ్ముకున్నారనే పలు ఇతర తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఎంక్వయిరీ కూడా నడుస్తుంది.. సదరు ఎంక్వయిరీ కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు.. దీంతో పాటు సదరు ఏఈని కాపాడేందుకు ఓ ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సదరు ఏఈ సస్పెన్షన్ ఆపాలంటూ ఎమ్మెల్యేలతో పాటు ఇతర పలు ముఖ్యులతో కమిషనర్‌కు సిఫార్సులు చేయించినట్లు సమాచారం. ఇదంతా కూడా ఓ ఈఈ ఆధ్వర్యంలో నడుస్తుంది.

పాత సామాను ఏమి పోలేదని చెప్పాలట..

- పాత సామాన్లు అమ్మేసుకుంటున్నారు.. అనే కథనంపై సాక్షిలో కథనం
- దీనిపై కమిషనర్ క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం
- విచారణకు ఏ అధికారి వచ్చినా సామాను ఏమి పోలేదని చెప్పాలని ఫిట్టర్లను ఆదేశిస్తున్న అవుట్ సోర్సింగ్ లీక్ వర్కర్



సాక్షి

పాత సామాన్లు అమ్మేసుకుంటున్నారు..

మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏటీ అగ్రహారం, మిర్చియార్డు వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న పాత సామానులు(పాత మోటార్లు, పైపులైన్‌లు) ఇంజినీరింగ్ సిబ్బంది అమ్ముకుంటున్నారనే తీవ్రమైన ఆరోపణలపై మంగళవారం సాక్షిలో పాత సామాన్లు అమ్మేసుకుంటున్నారు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి తగిన నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించినట్లు సమాచారం. అయితే ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం ఏమిటంటే ఎక్కడైన ఇంజినీరింగ్ ఏఈ స్థాయి అధికారులు లైన్‌లోకి వచ్చి దీనిపై స్పందించాల్సి ఉంది. కాని ఇక్కడ ఓ లీకు ఆపరేటర్ కమ్ ఫిట్టర్ పాత సామాను పోలేదని చెప్పండి అని ఇంజినీరింగ్ సిబ్బందికి హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం.

కీలకంగా వ్యవహరిస్తున్న లీక్ వర్కర్

కొన్ని లక్షల రూపాయల విలువైన పాత సామానులు అమ్ముకోవడంలో ఇంజినీరింగ్ అధికారులు పాత్ర అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని కప్పిపుచ్చుకునేందుకు ఏటీ అగ్రహారం వాటర్ ట్యాంకుల్లో పనిచేసే లీక్ వర్కర్ కమ్ ఫిట్టర్‌ను రంగంలోకి దింపినట్లు సమాచారం. సదరు లీక్ వర్కర్ ఏటీ అగ్రహారం, కేవీపీ కాలనీ, మిర్చియార్డు, హౌసింగ్ బోర్డు వాటర్ ట్యాంకుల్లో పనిచేస్తున్న వాల్వ్ ఆపరేటర్ల వద్దకు వెళ్లి పాత సామాను పోలేదని చెప్పండని... లేకపోతే మీ ఉద్యోగాలు పోయేలా చూస్తానని ఓ అవుట్ సోర్సింగ్ లీక్ వర్కర్ కమ్ ఫిట్టర్ బెదిరింపులు దిగడంపై పాత సామానులు మాయం కావడం నిజమేనని అర్థం చేసుకోవచ్చు.

ఇష్టానుసారంగా వాటర్ ట్యాపులు

సదరు ఏటీ అగ్రహారం వాటర్ ట్యాంకుల పరిధిలో అనధికారికంగా ఇష్టానుసారంగా వాటర్ ట్యాపులన్నీ కూడా ఈ లీక్ వర్కర్ కమ్ ఫిట్టర్‌యే ఇస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. ఒక ట్యాప్‌కి రూ.10 నుంచి 25 వేల దాకా తీసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇదంతా ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చేస్తున్నాడంటే అతిశయోక్తి లేదు.

విద్యార్థుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

గుంటూరు వెస్ట్: విద్యార్థుల న్యాయమైన కోర్కెలు తీర్చడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎటుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చిన హామీల్లో స్పష్టత లేదని చెప్పారు. వసతి దీవెన నిధులు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని కారణంగా చదువులు పూర్తయిన విద్యార్థులకు ఆయా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన డిగ్రీ హానర్స్ విద్యార్థులకు శాపంగా మారిందని వాపోయారు. దీనికి సంబంధించిన పరీక్ష అంతా గందరగోళంగా ఉందని చెప్పారు. కాస్మోటిక్, మెస్ బిల్లులు నెలలు తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లకు ఒక్కొక్కరికి రూ.96 కేటాయిస్తుందన్నారు. విద్యార్థుల హాస్టళ్లకు మాత్రం రూ.53, పాఠశాలలకు రూ.46 చెల్లిస్తున్నారని చెప్పారు. విద్యార్థులంటే ఈ ప్రభుత్వానికి చిన్న చూపని వెల్లడించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, ఉపాధ్యక్షులు నవిత, సహాయ కార్యదర్శి యశ్వంత్, అభి, జమీర్ పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోయిన వీఆర్ఓ

- అక్రమ మైనింగ్ జరిగే ప్రతి గ్రామానికి ఆమె ఇన్‌చార్జి
- ఇటీవల జరిగిన ట్రాన్స్‌ఫర్స్‌లో చక్రం తిప్పిన వైనం
- తహసీల్దారు కార్యాలయంలోనూ తనదే హవా

గుంటూరు రూరల్: అధికార పార్టీ అండతో వీఆర్ఓ హసీనా రెచ్చిపోయినట్లు సమాచారం. ప్రజల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి మండల స్థాయి అధికార పార్టీ నేతలకు కొంత ముట్టజెప్పినట్లు ఆరోపణలున్నాయి. అక్రమ మైనింగ్ గ్రామాలు తానే ఇన్‌చార్జి వీఆర్ఓగా పనిచేస్తుండేదని, ఆమె ఏమి చెబితే మిగిలిన అధికారులు అది చేయాల్సిందేనని ఆమె ప్రవర్తన చూసిన అధికారులే చెవులు కొరుక్కుంటున్నారు.

వీఆర్ఓల బదిలీల్లో ఆమెదే హవా

ఇటీవల నిర్వహించిన సాధారణ వీఆర్ఓల బదిలీల్లో ఆమెది హవా. నియోజకవర్గం ప్రజా ప్రతినిధి కార్యాలయం నుంచి ఏ గ్రామానికి ఏ వీఆర్ఓను పంపాలి, ఎవరిని ట్రాన్స్‌ఫర్ చేయాలి, బదిలీకి ఎంత మొత్తం తీసుకోవాలి వంటి కార్యకలాపాలన్నీ ఈ వీఆర్ఓ కనుసన్నల్లోనే జరిగాయని రెవెన్యూ విభాగం అధికారుల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. బదిలీలకు రూ.లక్షల్లోనే వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక చిన్నపాటి సమస్యల నుంచి రియల్ ఎస్టేట్ వెంచర్ల వరకూ చెప్పాలంటే ప్రతి పనికి ఒకరేటు.

ఎప్పటి నుంచో ఆరోపణల వెల్లువ

తహసీల్దార్ కార్యాలయంలో ఆమె చెప్పింది జరుగుతుందనే ప్రచారం బాగా ఉంది. కింది స్థాయి సిబ్బందిని చులకనగా మాట్లాడటం సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలతో కనీసం మాట్లాడటానికి కూడా అవకాశం ఇచ్చేదికాదని, అంతా నగదు లావాదేవీలేనని ప్రజలు చెబుతున్నారు. గతంలో వీఆర్ఓ హసీనాపై మంగళగిరి ప్రాంతంలో రూ.5 కోట్ల విలువైన భూ వివాదం ఉన్నట్లు తెలిసింది. ఆ వ్యవహారంలో కూడా ఆమె పెద్ద మొత్తంలో తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జీవితాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలి



మాట్లాడుతున్న కేబీఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని విజయవాడలోని కేబీఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఉజ్వల భవిష్యత్ కోసం లక్ష్యాన్ని ఏర్పరచుకోవడంపై డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతులు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రధానంగా స్పష్టమైన లక్ష్యం, దానిని సాధించడంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లే సామర్థ్యం అవసరమని సూచించారు. నేర్పు, సమయపాలన, అకుంటిత దీక్ష, అందరితో కలిసిపోయే స్వభావం, విద్యలో పోటీ పడే తత్వం ఉండాలని తెలిపారు. ఉన్న ఒక్క జీవితాన్ని చాలా అందంగా మలచుకోవాలని, తల్లి తండ్రులను, గురువులని ఎప్పటికీ మరచిపోకూడదని, స్వామి వివేకానంద స్ఫూర్తి, ఝాన్సీ రాణి ధైర్యం, సుభాష్ చంద్ర బోస్ దేశ భక్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, కేబీఎన్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి.నారాయణ రావు, డాక్టర్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, టీజేపీఎస్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, డాక్టర్ రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, డాక్టర్. పి.దేవేంద్ర గుప్త పాల్గొన్నారు.

అర్చకుల కనీస వేతనం పెంపుదలపై హర్షం

నగరంపాలెం: దేవదాయ శాఖ పరిధిలో ఏడాది ఆదాయం రూ.50 వేలు దాటిన దేవాలయాల్లో పని చేసే అర్చకులకు కనీస వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై అర్చక జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంధ్యాల వెంకటరామలింగేశ్వరశాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డీడీఎన్ఎస్ పథకానికి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు, వేదం పూర్తి అయిన వేద విద్యార్థులకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. జీఓ 223 ద్వారా ఆలయాలకు సంప్రదాయ విషయాలలో స్వయం ప్రతిపత్తిని కల్పించటంతో ప్రశ్నార్థకంగా ఉన్న భవిష్యత్‌పై రాష్ట్రంలోని 27,872 దేవాలయాలకు కూటమి ప్రభుత్వం ఊపిరి పోసిందని అన్నారు. సీఎం చంద్రబాబుకి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అర్చక జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మపేరుతో మొక్క నాటిన విద్యార్థినులు



గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ తల్లిపేరుతో మొక్క నాటాలని గుంటూరు జిల్లా నెహ్రూ యువకేంద్ర అధికారిణి దేవిరెడ్డి కిరణ్మయి పేర్కొన్నారు. బుధవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థినులతో మొక్కలు నాటించారు. ఈసందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. మొక్కలు నాటి, చెట్లను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించినవారవుతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.సంతోషికుమారి, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు పాల్గొన్నారు.

ఈనెల 9, 10 తేదీల్లో నాటకోత్సవాలు

నగరంపాలెం: గుమ్మడి శ్రీమన్నారాయణమూర్తి, వైకే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో ఈనెల 9, 10 తేదీల్లో నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొరిటిపాడు ఎల్‌వీఆర్ అండ్ సన్స్‌క్లబ్ అండ్ రీడింగ్ రూమ్‌లో 9వ తేదీ సాయంత్రం మనః సాక్షి, హెచ్చరిక అనే సాంఘిక నాటికలు, 10 తేదీ సాయంత్రం ఓరి వీళ్ల నటన పాడుగాను ఆడిషన్స్ స్కిట్, బంధం నాటికలు ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు రంగస్థల నటులకు బొప్పన ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

శివదండకం పఠనంతో కార్యసిద్ధి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాయంత్రం శ్రీమదాంధ్ర మహాభారతాంతర్గత అర్జున స్తుత శివదండకంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కె.వి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఒకానొకప్పుడు వ్యాసభగవానుడు పాండవులతో మీరు యుద్ధంలో కౌరవులపై గెలవాలంటే శివానుగ్రహం తప్పకుండా ఉండాలన్నారు. శివదండకం పఠనంతో కార్యసిద్ధి కలుగుతుందని వివరించారు.

నేత్ర వైద్య శిబిరం నేడు

లక్ష్మీపురం: కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ చాకలి గుంటలో సీపీఐ ఆధ్వర్యంలో అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. నగర కమిటీ సభ్యులు రావుల అంజిబాబు, చినబోతుల విజయకుమార్ పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలి

లక్ష్మీపురం: అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా విద్యుత్ వినియోగదారులపై భారం తప్పడం లేదని, చార్జీలు పెంచబోమంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అందుకు భిన్నంగా ప్రజలపై భారం వేస్తున్న ప్రభుత్వ తీరును ప్రజలు నిరసించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కోరారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం విద్యుత్ చార్జీల పెంపుదలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాటు అంటూ వివిధ రకాల చార్జీల పేరుతో భారాలు మోపటంతో అసలు విద్యుత్ యూనిట్ ధర కంటే వీటి ధర అధికంగా ఉంటుందని విమర్శించారు. ఈ నెల బిల్లుల నుంచే రూ.6,072.82 కోట్ల వడ్డన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా రూ.11,826.15 కోట్లు భారం వేసేందుకు సిద్ధమవుతుందని ఆరోపించారు.

స్థానం పదిలం.. రచనలు సుస్థిరం

- విశిష్ట స్త్రీవాద రచయిత్రి సుజాత
- నేడు గుంటూరులో ఆచార్య ఎన్‌జీ రంగ సాహితీ పురస్కారం



'పచ్చబొట్టు'తో సి.సుజాత

తెనాలి: సాహిత్య సృజనలో విశిష్ట స్త్రీవాద రచయితగా తన స్థానాన్ని పదిలం చేసుకున్న సి.సుజాత ఆచార్య ఎన్‌జి రంగ సాహిత్య పురస్కారం అందుకోనున్నారు. ఆచార్య ఎన్‌జి రంగ ఫౌండేషన్ నిర్వహించిన నవలల పోటీలో సుజాత రచన 'పచ్చబొట్టు' నవలకు ద్వితీయ బహుమతి లభించింది. ఈనెల 7న గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై జరగనున్న ఎన్‌జి రంగ జయంతి వేడుకల్లో నగదు బహుమతితో సుజాతను సత్కరిస్తారు. ఈ సందర్భంగా రచయిత్రి పరిచయం.

భిన్నమైన ఇతివృత్తాలతో వాస్తవానికి దగ్గరగా సహజంగా ప్రవర్తించే పాత్రలతో రచనా వ్యాసంగం చేస్తున్న సుజాత స్వస్థలం తెనాలి. వ్యవసాయం, వ్యాపారం రెండూ నడిపే కుటుంబంలో 1955 డిసెంబరు 12న జన్మించారు. జేఎంజే మహిళా కాలేజీలో డిగ్రీ చదువుతుండగానే వివాహమైంది. ఇదే జిల్లాలోని యడ్లపాడు దగ్గర్లోని జగ్గాపురం వెళ్లారు. ఇల్లు దాటి, నాలుగ్గోడలు దాటి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టే అవకాశం, మరో కాలక్షేపం లేని ఆకాలంలో మొత్తంగా పుస్తకాలే నేస్తాలయ్యాయి. అలా తెలుగు సాహిత్యంలో దాదాపు ప్రతి పుస్తకాన్ని చదివారు. సాధారణ కుటుంబాల్లో వచ్చే ప్రతి అనుభవాన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చూడగలగటంతో సమాజంలో స్త్రీ స్థానం అట్టుడుగున పాతేసి వుందని తెలుసుకోగలిగారు.

జర్నలిస్టుగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో సబ్‌ఎడిటర్‌గా, హారతి మాసపత్రిక మేనేజింగ్ ఎడిటర్‌గా, స్నేహ, సెల్యూట్, రైతుసేవ పత్రికలకు ఎడిటర్‌గా, కళ్యాణమస్తు, సందడి డాట్‌కామ్‌లకు కంటెంట్ ఎడిటర్‌గా చేశారు. తర్వాత ఈటీవీలో 'సఖి', వనితా ఛానల్‌కు స్క్రిప్టురైటర్‌గా, డైరెక్టర్‌గా రెండువేలకు పైగా మహిళా కార్యక్రమాలను చేశారు. హెచ్ఎం టీవీలో ప్రోగ్రామింగ్ హెడ్‌గా, టీవీ7 హెల్త్ ఛానల్‌కు క్రియేటివ్ హెడ్‌గా చేశారు. ప్రస్తుతం సొంతూరులోనే నివసిస్తూ వనితా టీవీవారి వనితావాణి డాట్‌కామ్‌కు కంటెంట్ ఎడిటర్‌గా, మన తెలంగాణ పత్రికకు ప్రత్యేక కరస్పాండెంట్‌గా చేస్తున్నారు.

ఉద్యోగాలు చేస్తూనే రచనా వ్యాసంగం కొనసాగించిన సుజాత తొలి నవల 'సప్తభుజంగాలు'. అన్ని భాషల్లోకి అనువదింపదగిన పుస్తకంగా నేషనల్ బుక్ ట్రస్ట్ సిఫార్సు చేసింది. 199 ప్రపంచ పుస్తక ప్రదర్శనలో అన్ని భాషల్నుంచి ఎంపిక చేసిన 1100 పుస్తకాల్లో ఇదొటి, తర్వాత 'రాతిపూలు', 24/7 న్యూస్‌ఛానల్' నవలలు రాశారు. ఆమె రాసిన కథలు 'సుజాత కథలు', 'రెప్పపాటు ఉప్పెన', 'నెరుసు' పేర్లతో కథాసంపుటాలుగా వచ్చాయి. సుజాత కథల్లో చాలాభాగం ఇంగ్లిష్‌లోకి అనువాదమయ్యాయి. ఇండియన్ లిటరేచర్, ప్రతిభ, ఇండియా వంటి మేగజైన్లలో ప్రచురితమయ్యాయి. 'కథాకోకిల' పురస్కారం, విశిష్ట మహిళ పురస్కారం, ప్రతిభ పురస్కారం, డాక్టర్ పరుచూరి రాజారాం సాహితీ పురస్కారం, తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కారం లభించాయి. లభించింది.

సుజాత రచనలన్నీ ఒకలాంటి ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్. ఆ రాతలు మనతో మాట్లాడతాయి. జీవితపు వాస్తవికతనూ, నిర్దాక్షిణ్యతనూ, మనుషుల మామూలుతనాన్నీ నగ్నంగా మనముందు ప్రదర్శిస్తాయి. స్పందన తెచ్చిపెట్టుకుని రాయటం, ఎప్పుడు రాయాలంటే అప్పుడు రాయగలగటం, రాతలకు, వ్యక్తిత్వానికి పొంతన లేకపోవటం ...ప్రొఫెషనల్ రచయిత లక్షణాలైతే, సుజాత ఆ కేటగిరీలోకి కచ్చితంగా రారు. తనకు తోచినపుడు, మనసు స్పందించినపుడు, భావోద్వేగాల సంచయం ఎగదోసినపుడు మాత్రమే రాసే రచయిత్రి సుజాత. ఎవరికోసమో తన ఆలోచనలను మార్చుకొని రాజీపడే గుణం ఆమెలో లేదని ఆమె రచనలు తెలియజేస్తాయి. అందుకే ఆమెను కొందరు 'కమ్యూనిస్టు' అన్నారు. మరికొందరు 'ఫెమినిస్టు' అన్నారు. నిజానికామె వాస్తవికవాది.

'పచ్చబొట్టు'కు అవార్డు..

తాజా అవార్డు లభించిన 'పచ్చబొట్టు' నవల వ్యవస్థలో కులానికున్న ఆధిపత్య బలాన్ని ఎత్తిచూపుతుంది. తెలివితేటలతో ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా దళితుల్లో మరీముఖ్యంగా పేదలు, చొరవగా నలుగురితో కలిసిపోలేని వైనాన్ని, తాను చూసిన అంశాలతో ఈ నవలలో రాశారు. ముందు కులం... ఆతర్వాతే మనుషులమన్న స్పృహ ఉంటుందన్న వాస్తవికతను చెప్పారు. 'నేను నమ్మింది, అనుభవించింది సూటిగా నా కథల్లో కనిపిస్తూనే ఉంటుంది' అంటారు సుజాత. 'నేను అమితంగా, వెర్రిగా ప్రేమించే నాతోటి ఆడవాళ్లందరూ నాకు అప్పులనే ఊహతో, ఆశతో నేను చాలా సంతృప్తురాలిని...స్త్రీవాదం అంటూ వస్తుందనీ, నేను రాసే కథలతో ఫెమినిస్టు రైటర్‌గా గుర్తింపు రావటం గొప్ప సంతోషం' అన్నారు. గొప్ప రచయితలు, కళాకారులు పుట్టిన తెనాలిలో పుట్టటం, తన ఉనికి సాహిత్యంలో ఏమూలనైనా కాస్త మెరవటంతో జన్మసాఫల్యమైంది అంటారు. వీటిన్నింటికీ మించి స్త్రీనై పుట్టినందుకు మరింత గర్విస్తున్నానని చెబుతారు సుజాత.

ఏడీహెచ్‌గా రామారావు బాధ్యతలు స్వీకారం



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌గా(ఇన్‌చార్జిగా) జె.రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీహెచ్‌గా పనిచేసిన రామారావు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఉపాసెల్ పీఓగా పనిచేస్తున్న జె.రామరావును ఇన్‌చార్జి ఏడీహెచ్‌గా నియమిస్తూ నగర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు, ఏడీహెచ్‌ను గాంధీ పార్కులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్కుల్లో పనిచేసే ఉద్యోగులకు పని ముట్లు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని రామారావు తెలిపారు.